క్లుప్తంగా

మణుగూరులో 140 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరు రూరల్: సింగరేణి మణుగూరు ఏరియాలో ఆగస్టు నెలకు సంబంధించి 140శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఈ మేరకు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏరియాకు 7,78,200టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 10.89 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైందని తెలిపారు. అలాగే, ఓబీ వెలికితీత 12లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 10.22లక్షల క్యూబిక్ మీటర్లు(85శాతం) వెలికితీసినట్లు చెప్పారు. అంతేకాకుండా ఆగస్టులో 10.89లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, ఎస్.రమేష్, వెంకట్రావు, డాక్టర్ శేషగిరిరావు, అనురాధ, ఎస్.శ్రీనివాస్, షబ్బీరుద్దీన్, సాయిల సురేష్ పాల్గొన్నారు.

మొబైల్ కోర్టును సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట, దమ్మపేట మండలాల వాసులు మొబైల్ కోర్టు సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6న మండలంలోని మందలపల్లిలోని కోర్టులో డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులను పరిష్కరిస్తారని, ఆయా బాధితులు మొబైల్ కోర్టుకు హాజరై జరిమానా చెల్లించి, కేసుల నుంచి బయటపడొచ్చని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

చండ్రుగొండ: పార్టీ హైకమాండ్ ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేసిన కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శాయశక్తుల కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీ ప్రాంతంలో ఉన్న హస్తాల వీరన్న స్వామిని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి సన్నిధిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పొంగులేటి సారథ్యంలో ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు గెలుస్తామన్నారు. బోజ్యా నాయక్, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ గుగులోత్ రాములు, సొసైటీ డైరెక్టర్ బాణోత్‌రాముడు, చలపతిరావు, సురేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో పూజలు

ములకలపల్లి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని స్థానిక శిశుమందిర్ ఆవాస విద్యాకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, ప్రధానాచార్యులు కుంజా జగన్, క్లబ్ అధ్యక్షుడు కేథారేశ్వరరావు, సెక్రటరీ రేపాక ప్రసాద్, ట్రెజరర్ రంజాన్, అనంతుల మహేశ్, నాయకులు శనగపాటి సీతారాములు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

చండ్రుగొండ: మండలంలోని తుంగారం గ్రామంలో శుక్రవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనూజ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని దామరచర్ల గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

వీధి దీపాలు ఏర్పాటుచేయాలి

మణుగూరు రూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లోని వాడల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకుల బృందం మున్సిపాలిటీ పరిధి గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కుటుంబరావు, నరసింహరావు, నాయుడు, రాజబాబు, బిక్షం, రాములు, దశరథం ఉన్నారు.

పల్లె ప్రగతి బాట కార్యక్రమం

మణుగూరు రూరల్: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముత్యంబాబు ఆధ్వర్యంలో మండలంలోని బుగ్గ గ్రామంలో శుక్రవారం కేసీఆర్ పల్లె ప్రగతి బాట కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వీరన్నబాబు, రామారావు, మల్లయ్య, ఆంజనేయులు, రమేష్, రాజు, సత్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

దుమ్ముగూడెం: సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని జాక్టో కో చైర్మన్ కల్లూరి జయ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మారాయిగూడెం ఎంపీయూపీఎస్ పాఠశాలలో జాక్టో పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు బొర్రయ్య, సీతారామయ్య, హిందులత, చిన్నక్క, పార్వతి ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

విస్తరణకు గ్రీన్‌సిగ్నల్!

మేజర్ జీపీ రహదారికి మహర్దశ

- 33 అడుగులుగా విస్తరణ?
- డివైడర్, డ్రెయినేజీ నిర్మాణానికి సైతం ప్రతిపాదనలు
- మినీ రింగ్ నిర్మాణం కూడా..


డబుల్ రోడ్డుగా విస్తరించనున్న మేజర్ పంచాయతీ మార్గం

అశ్వారావుపేటరూరల్: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే సింగిల్ రోడ్డుకు త్వరలోనే మహర్దశ పట్టనుంది. నియోజకవర్గ కేంద్రంలో పూర్వపు ప్రధాన రహదారైన ఈ మార్గాన్ని విస్తరించేలా అడుగులు పడుతున్నాయి. నిత్యం రద్దీ ప్రాంతంగా ఉండే ఈ మార్గం ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా ఉండగా, దీనిని విస్తరించేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో రింగ్ రోడ్డులోని డివైడర్ ముగింపు (పోలీస్ స్టేషన్ సెంటర్) నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఈ మార్గాన్ని సుమారు 120 మీటర్ల పొడువు వరకు డబుల్ రోడ్డుగా విస్తరించడంతోపాటు మినీ సెంట్రల్ డివైడర్, రహదారికి రెండు వైపులా మెగా డ్రెయినేజీ నిర్మించేలా చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో సెంట్రల్ డివైడర్ నుంచి 33 అడుగుల మేర వెడల్పు ఉండేలా రహదారి విస్తరించనున్నారు. దీన్ని విస్తరించేందుకు ఇప్పటికే కొలతల సేకరణ ప్రక్రియను పూర్తి చేయగా, నిధులు అంచనాలను సిద్ధం చేసే పనుల్లో రోడ్లు భవనాల శాఖ అధికారులు నిమగ్నం అయ్యారు. దాంతో ఈ మార్గంలో రహదారి విస్తరణతోపాటు ఆయా పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది.

విస్తరణ అనివార్యం...

ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో అశ్వారావుపేటలోని భద్రాచలం రోడ్డులో రహదారి విస్తరణతోపాటు ఖమ్మం, జంగారెడ్డిగూడెం మార్గాల్లో సెంట్రల్ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు మంజూరయ్యాయి. ఆయా పనులకు నిధులు మంజూరు, టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో నెల రోజుల క్రితమే నిర్మాణ పనులు సైతం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ పనులతోపాటే పంచాయతీకి వెళ్లే మార్గంలో రహదారిను విస్తరణ డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ మార్గం ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా ఉండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంది. ఈ మార్గంలోనే రెండు బ్యాంకులు, మేజర్ పంచాయతీ కార్యాలయంతోపాటు అనేక దుకాణాలు, హోటళ్లు, ఓ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల, రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి భవనం ఉన్నాయి. అంతేకాకుండా ఈ మార్గంలోనే భగత్ సింగ్ సెంటర్‌తోపాటు, ఎడమ వైపున గాంధీబొమ్మ సెంటర్, పాపిడిగూడెం, గంగారం గ్రామాలకు వెళ్లే మార్గాలున్నాయి. దాంతో నిత్యం మార్గాల్లో వాహనాల రాకపోకలు, జన సంచారం అధికంగా ఉంటుంది. శెలవు రోజుల్లో మినహా మిగిలిన అన్నీ రోజుల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో మార్గంలో పార్కింగ్ స్థలాలు లేక రోడ్డుపై వాటిని నిలిపివేస్తుంటారు. ముఖ్యంగా బ్యాంకులు, హోటళ్ల వద్ద వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేయడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మరో మినీ రింగ్ సైతం..

ఈ మార్గంలో ప్రధాన రహదారి విస్తరణతోపాటు పోలీస్ స్టేషన్ సెంటర్‌లో మరో మినీ రింగ్‌ను సైతం నిర్మించే విధంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జాతీయ రహదారిలో ఓ రింగ్ రోడ్డు ఉండగా, దీనికి అనుసంధానంగానే పోలీస్ స్టేషన్ సెంటర్ సమీపంలో మరో మినీ రింగ్‌ను నిర్మించేలా అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఈ మినీ రింగ్ నిర్మాణంతో నియోజకవర్గ కేంద్రానికి మరింత అందం, ఆహ్లాదం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీన్ని నిర్మించడం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తొలగించపోవడంతోపాటు, రోడ్డు ప్రమాదాలను సైతం నివారించే విధంగా ఉంటుందని రోడ్లు భవనాల శాఖ అధికారులు దృష్టి సారించారు.


విస్తరణకు కొలతలు సేకరిస్తున్న రోడ్లు భవనాల శాఖ సిబ్బంది

అంచనాలు సిద్ధం చేస్తున్నాం

మేజర్ పంచాయతీ మార్గంలో రహదారి విస్తరించేందుకు అంచనాలు వేస్తున్నాం. విస్తరణలో భాగంగా అవసరమైన కొలతలను సేకరించినట్టు తెలిపారు. కాగా త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని, పూర్తి వివరాలు ఇప్పుడే చెప్పలేమన్నారు.

– శెట్టిపల్లి కృష్ణార్జునరావు, ఏఈ, ఆర్అండ్‌బీ

పల్లెల అభివృద్ధే లక్ష్యం..

పినపాక: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుదూర మారుమూల ప్రాంతాలకు రహదారుల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీలో సుమారు రూ.8 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రభుత్వం అన్ని రంగాల ప్రజలకు సంక్షేమం అందజేస్తుందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం నాలుగు వేల పెన్షన్ పెంచిందని, త్వరలోనే అందరికీ రూ.2,000 నుంచి రూ.3,000 పెన్షన్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, భద్రయ్య, రవి శేఖర్ వర్మ, కంది సుబ్బారెడ్డి, వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.


బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు

దృష్టి అంతా అభివృద్ధిపైనే..


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: తన దృష్టి అంతా అభివృద్ధి, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడంపైనే ఉంటుందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించి, సీసీ రోడ్లను ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సీటు దక్కించుకున్న తర్వాత ఆయన తొలిసారిగా అశ్వారావుపేటలో పర్యటించేందుకు రాగా, ఆయనకు మండలంలోని అచ్యుతాపురం వద్ద నుంచి దాదాపు వంద కార్లతో భారీ ర్యాలీగా, మండలంలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో సర్పంచ్ నారం రాజశేఖర్ ఆధ్వర్యంలో భారీ క్రేన్ సాయంతో గజమాల వేసి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వార్యంలో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ శ్రీధర్, ఎంఈఓ పీ కృష్ణయ్య, ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండి పుల్లారావు, మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, కాసాని చంద్రమోహన్, సత్యవరపు సంపూర్ణ, ఆకుల శ్రీను, వెంకటనరసింహా, చందా లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

విచారణ త్వరగా పూర్తిచేయాలి

దుమ్ముగూడెం: మండలంలో గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీనగరం, తూరుబాక, కొత్త దంతెనం గ్రామాల్లో గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు రిపోర్టు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యాలరావు, ఆర్ఐ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న ఆర్డీఓ మంగీలాల్

పనులు చేయించినా బిల్లులు ఇవ్వట్లే ..


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజా ప్రతినిధులు

ములకలపల్లి : జీపీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనుల తాలూకా బిల్లుల మంజూరీలో అలసత్వంగా వహిస్తున్నారని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మలకలపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మట్ల నాగమణి అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. 6న సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ పుల్లారావు, కో ఆప్షన్ సభ్యుడు జబ్బార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

భద్రాచలంఅర్బన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచి, కనీస వేతన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేషడిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్.నాగరాజు అధ్యక్షతన సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కో కన్వీనర్ మర్లపాటి రేణుక, పట్టణ కమిటీ సభ్యులు రమాదేవి, గుమ్మడి నాగరాజు, రాజబాబు, వెదుళ్ల శ్రీనివాస్, సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

దమ్మపేట: అతివేగంతో ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడిన ఘటన మండలంలోని గంగులగూడెం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం మండలంలోని మల్కారం గ్రామం నుంచి ఆటో ముగ్గురు ప్రయాణికులతో దమ్మపేట గ్రామానికి వస్తోంది. డ్రైవర్ అతివేగంగా నడుపుతుండటంతో గంగులగూడెం శివారుకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొదల్లో బోల్తా పడింది. ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని గ్రామీణ వైద్యుడి వద్దకు తరలించారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరు రూరల్: పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మీ అన్నారు. మణుగూరు-1,4, శివలింగాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, సుజాత, ఆయా సావిత్రి పాల్గొన్నారు.

చండ్రుగొండ: పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీడీఎస్ సీడీపీఓ నిర్మలా జ్యోతి, సూపర్‌వైజర్లు శకుంతల, రాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే అభివృద్ధి

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి జరుగుతుందని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నా దేశం- నా మట్టి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అభయాంజనేయ స్వామివారి ఆలయంలో కలశం పూజా కార్యక్రమం నిర్వహించి మట్టి సేకరణ చేశారు. కార్యక్రమంలో రాజు బెహరా, త్రినాథ్‌రావు, సతీష్, నాగబాబు, రామ్మోహన్ రావు, సుబ్బారావు, కోటేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సర్వశిక్ష అభియాన్ పథకం కింద వివిధ కేడర్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్‌యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం విధులకు నల్లబ్యాడ్జీలతో హాజరై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షినెట్‌వర్క్


పినపాక: వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు


అశ్వారావుపేటరూరల్: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


చర్లలో..

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


వాలీబాల్ కిట్లు అందజేస్తున్న డీఎస్పీ

బూర్గంపాడు: గిరిజన యువత క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాణించాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ అన్నారు. బూర్గంపాడు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బూర్గంపాడు మండలంలోని రాజీవ్‌నగర్, బట్టిగూడెం వలస ఆదివాసీ గ్రామాలలోని యువతకు వాలీబాల్ కిట్లను అందించారు. ఎస్సైలు రాజ్‌కుమార్, నాగభిక్షం పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి ఎంబీబీఎస్ సీట్


కుసుమాంజలి

భద్రాచలంటౌన్: భద్రాచలం గురుకులం కళాశాలలో చదివిన విద్యార్థి ఎంబీబీఎస్ సీటు సాధించింది. బైపీసీతో ఇంటర్ పూర్తిచేసిన చదివిన కొట్టెం కుసుమాంజలి కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సీట్ దక్కించుకుంది. ఇంటర్‌లో 891 మార్కులు సాధించిన కుసుమాంజలి నీట్ లోనూ మెరుగైన ర్యాంకు సాధించగా ఎంబీబీఎస్ సీటు రావడంతో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు అభినందించారు.

ఓటు నమోదు చేసుకోవాలి

అశ్వాపురం: 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. నేడు, రేపు ప్రత్యేక క్యాంపెయిన్‌తో మండలంలో 41 పోలింగ్ స్టేషన్లలో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని గుంపెన పంచాయతీలో ఈవీఎం, వీవీ ప్యాడ్లపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సెమినార్‌కు ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: అక్టోబర్ నెలలో అమెరికాలో జరిగే కార్డియాక్ సెమినార్‌కు భద్రాచలం పట్టణానికి చెందిన డాక్టర్ క్రాంతి కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. భద్రాచలానికి చెందిన గేదెల శివశంకర్, ప్రభావతిల కుమారుడు క్రాంతి కుమార్ కేరళ రాష్ట్రంలోని అమృత మెడికల్ కాలేజీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ మేరకు పలువురు క్రాంతికుమార్‌ను అభినందించారు.

అర్హులందరికీ దళిత బంధు, గృహలక్ష్మి ఇవ్వాలి


మాట్లాడుతున్న కనకయ్య

మణుగూరు రూరల్: అర్హులైన వారందరికీ దళితబంధు, గృహలక్ష్మీ పథకాలను వర్తింపజేస్తూ రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక శ్రామికభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళిత బంధు ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని, గృహలక్ష్మీ పథకంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు, మాచారపు లక్ష్మణరావు, టీవీఎంవీ ప్రసాద్, పిట్టల నాగమణి, సుధాకర్ పాల్గొన్నారు.

నాసిరకం చీరలు మాకొద్దు..

బూర్గంపాడు: నాసిరకం చీరలు మాకొద్దని మధ్యాహ్న భోజన వర్కర్లు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు అనంతపురానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ చీరలను పంపిణీ చేసింది. ఆ చీరెలు నాసిరకంగా ఉన్నాయని ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన చేసి చీరలను అక్కడే పడేసి వెళ్లిపోయారు.

అవకాశవాదులను ఓడించండి

చర్ల: పదవుల కోసం డబ్బుకు అమ్ముడు పోయి పార్టీలను మార్చే అవకాశవాదులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం చర్లలోని బీఎస్ రామయ్యభవన్‌లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారాలు, 7న మండల కేంద్రాల్లో దర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, బీ రమేష్ మండల కార్యదర్శి కారం నరేష్, నాయకులుబందెల చంటి, తాటి నాగమణి, పామారు బాలాజీ, తాండూరు కృష్ణ, సాంబశివ రావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై జారిన డోజర్‌భాగం

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఆర్టీసీ అవుట్ గేట్ ఎదురుగా ప్రధాన రహదారిపై శుక్రవారం ఓ కంటైనర్ లారీ నుంచి భారీ డోజర్‌కు సంబంధించిన ఓ భాగం జారిపోయింది. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో భాగాలను లారీపైకి ఎక్కించారు. ఈ క్రమంలో సుమారు మూడు గంటల పాటు ప్రధాన రాహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



అధికారులకు వినతులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా హాస్పిటల్ శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్స్, కార్మికుల సమస్యలపై సీఐటీయూ యూనియన్ సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ పట్టణ కో కన్వీనర్ మర్లపాటి రేణుక మాట్లాడగా నాయకులు ఎన్. నాగరాజు,లక్ష్మీకాంత్, పొరెల్లి సంతోష్ కుమార్, రమాదేవి, కృష్ణ, రమా పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ స్లిపర్స్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద కార్మికులు నిరసన తెలిపి అనంతరం వైద్యాధికారి పూర్ణచంద్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, శ్రీను, వెంకటేశ్వరరావు, స్వాతి, శిరీష, దుర్గ, పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం సమస్యలు పరిష్కరించాలని..

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని డబుల్ బెడ్రూం కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఎంపీడీఓ ముత్యాలరావుకు వినతి పత్రం అందచేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, వంశీకృష్ణ, నాయకులు రామ్‌శెట్టి, వెంకటేశ్వర్లు, భీమయ్య, శ్రీనివాసరావు, చెల్లమ్మ పాల్గొన్నారు.

మీ సేవ నిర్వాహకులు...

ములకలపల్లి: మీసేవా నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల మీసేవ నిర్వాహకులు తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా మీ సేవా కమీషన్లు పెంచడం లేదని, దీంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పర్సిక జగన్నాథపురం, క్రాంతి, శ్యాం, సురేశ్, పాయం నర్సింహారావు ఉన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారి గూడెం పంచాయతీ పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ కౌన్సెలింగ్-3కు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి రోజా కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మా ట్లాడుతూ.. కళాశాలలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, బీఏ, బీకాం(జీ), బీకాం(సీఏ) గ్రూపులలో సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.